క్లుప్తంగా

తిమ్మాపురంలో సంక్రాంతి సంబరాలు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ప్రారంభించారు. సోమవారం ముగ్గులు పోటీలు, వాలీబాల్ ముగింపు పోటీలు ఉంటాయని ఎస్సై నాగార్జునరాజు, సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు.

గోకులంలో సంక్రాంతి వేడుకలు



శ్రీసూర్య నృత్యనికేతన్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక గోకులంలో శ్రీసూర్య నృత్యనికేతన్ నాట్యాచారిణి మహాలక్ష్మి విద్యార్థినులు ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మన సంస్కృతికి అద్దం పట్టే విధంగా విద్యార్థినులు వివిధ నృత్య రూపకాలు ప్రదర్శించారు. గొబ్బిళ్ల పాటలు, సంక్రాంతి గేయాలు చక్కని హావభావాలతో విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. హరిదాసు హరినామకీర్తనాలతో, గంగిరెద్దు వాళ్ల సన్నాయిలతో సందడి చేశారు. విద్యార్థినుల సంప్రదాయ దుస్తుల్లో సందండి చేశారు. సుమారు 200 మంది విద్యార్థినులు వేడుకల్లో పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న శ్రీచారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి జంక్షన్‌లోని శ్రీచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బియ్యం, పంచదార, నూనె, బెల్లం, కందిపప్పు, చింతపండు, కూరగాయలు ఇతర నిత్యవసరాలతో కూడిన వాటిని 100 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బంగారి నవ్య పద్మ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అనే నినాదంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. నిరుపేదలకు తమ ట్రస్ట్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. నిరుపేదలకు కూరగాయలు అందించిన అఖిలభారత యాదవ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి శివాజీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌బజార్ డైరెక్టర్ మన్నే నాగేశ్వరరావు, ట్రస్ట్ ట్రెజరర్ దేవీ రాజేశ్వరి, శ్రీపూజ స్టోర్ అధినేత ఎస్‌వీవీ రత్నరావు, ట్రస్ట్ సభ్యులు విల్లూరి హన్వాష్‌కుమార్, బంగారి వెంకటేష్, షేక్ ఖాజా మెహిద్దీన్, వైబాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

కాకినాడ రూరల్: మండలంలోని రాయుడుపాలెంలో సంక్రాంతి చిరు కానుకగా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. తొలుత న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి తరువాత వాటితో పాటు చీరలు, దుప్పట్లును యాదవ కులస్తులకు అందించారు. కార్యక్రమంలో యనమల రామం, కొయ్య బాబూరావు, నేమాల బాబీ, రామారావు, వీరబాబు, మహేష్, శ్రీను, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కాకినాడ రూరల్ : మండలంలోని పెనుమర్తి గ్రామ శివారులో పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తిమ్మాపురం ఎస్సై నాగార్జున రాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పట్టుబడగా, వారి నుంచి 18,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: సారా బట్టీలపై దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తమూలపేట సమీపంలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై రామలింగేశ్వరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. సారా బట్టీ నిర్వహిస్తున్న కొత్తమూలపేటకు చెందిన కొప్పిశెట్టి మంగరాజును అరెస్టు చేసి తన వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 100 లీటర్ల బెల్లపుఊటను సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ సారా నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. సారా తయారీ, విక్రయించినా సమాచారం అందించాలని కోరారు.



సూర్యారావుపేట బీచ్‌లో మారథాన్‌కు హాజరైన వారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



బిడ్డను చంకలో పెట్టుకుని పరుగు..

అలల హోరు.. పరుగుల జోరు..



మారథాన్‌లో పాల్గొనేందుకు వచ్చిన జనాలు



మారథాన్‌లో పాల్గొనే చిన్నారుల వార్మప్ స్టెప్స్..

కాకినాడ సాగర తీరాన ఉత్సాహంగా మారథాన్

కాకినాడ రూరల్: సాగర తీరం జనం సంద్రమైంది. కాకినాడ సీ పోర్టు మారథాన్‌తో ఆదివారం సూర్యారావుపేట బీచ్ సందడిగా మారింది. చిన్నా, పెద్ద, ముసలి అనే తేడా లేకుండా ఆడ, మగ అందరూ ఉత్సాహంతో పరుగులు తీశారు. కాకినాడ కేఎస్‌పీఎల్(సీ పోర్టు), రిలయన్స్, ఓఎన్‌జీసీ తదితర సంస్థల సహకారంతో 5వ ఎడిషన్‌గా మారథాన్ నిర్వహించారు. కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు జిల్లాలో, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఈ మారథాన్‌లో పరుగు కోసం వేకువ జామునే తరలివచ్చారు. సూర్యారావుపేట బీచ్‌లో సాగర హోరు ఒక పక్క..., జన హోరు మరో పక్క అన్నట్టు సందడి కనిపించగా హాజరైన వారిలో జోష్ నింపేందుకు నిర్వాహకులు తొలుత మ్యూజిక్‌తో వార్మప్ చేయించారు. బీచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టేజ్‌పై కొందరు, కింద మరి కొందరు అన్నట్టు చిన్నారుల, యువత, వృద్ధులు మ్యూజిక్‌కు అనుగుణంగా డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు. పోటీలు ప్రారంభించేందుకు విచ్చేసిన జిల్లా కలెక్టరు కృతికా శుక్లాతో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీ పడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. సీ పోర్టు ద్వారా టీ షార్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటిని ధరించి మారథాన్‌లో పరుగులు తీశారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న వారు ఉప్పాడ వరకు పరుగు పెట్టారు.

తొలిసారి పాల్గొన్నా.. చాలా హ్యాపీగా ఉంది



కాకినాడలో మారథాన్ నిర్వహించడం ఇది ఐదో సారి. అయినా తాను మాత్రం మొదటి సారి పాల్గొన్నాను. 5కే రన్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలు యువతలో పోటీ తత్వాన్ని నింపుతాయి.

– చిత్తచర్ల అభిరామ్, బీటెక్ విద్యార్థి, కాకినాడ

జనవరి రెండో ఆదివారమంటే కాకినాడ మారథానే..



దేశంలో ముంబయి, హైదరాబాద్ తదితర నగరాల్లో మారథాన్‌లు జరుగుతాయి. కాకినాడలో ఇది 5వ ఎడిషన్. జనంలో మంచి స్పందన వచ్చింది. చిన్నారులు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– ఎస్.ఎల్. శ్రీనివాస్, మారథాన్ నిర్వాహకుడు, కాకినాడ

ఆకట్టుకొన్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియలో జరుగుతున్న 52వ వార్షికోత్సవాలు, ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాట్యభారతి విద్యార్థులు చక్కని హావభావాలతో నృత్య రూపకాలు ప్రదర్శించి ఆకట్టుకొన్నారు. పురుహూతిక స్వరరాగ సమాఖ్య సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. నాట్యభారతి నాట్యాచారిణి ఆకెళ్ల పద్మావతి, సమాఖ్య నిర్వాహకురాలు గాయత్రిని సత్కళావాహని సభ్యులు సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సూర్యనారాయణమూర్తి, సత్యవాణి, ప్రకాశరావు, కూచిభాస్కరరామం, శారదాదేవి, శ్రీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

కరప: రబీ సీజన్‌లో రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏపీ రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అమలు చేసే రాయితీ పథకాలు పొందాలన్నా, పంటలబీమా వర్తించాలన్నా రైతులు, గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పండిస్తున్న పంట వివరాలు తెలియచేసి, బయోమెట్రిక్ వేసి నమోదు చేయించుకోవాలన్నారు.

నేటి నుంచి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో టోర్నమెంట్

- 78 యూనివర్సిటీలు, 1200 మంది క్రీడాకారులు
- జేఎన్‌టీయూకే క్రీడా మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కోవిడ్ అనంతరం జేఎన్‌టీయూకే క్రీడామైదానం సోమవారం క్రీడల పోటీలతో కళకళలాడనుంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సహకారంతో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో మెన్ టోర్నమెంట్‌కు సిద్ధమైంది. క్రీడాకారులు నగరానికి చేరుకోగా వర్సిటీ ఆవరణలో ఉన్న హాస్టళ్లలో సదుపాయం కల్పించారు. ఈ టోర్నమెంట్‌కు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలు ఇలా 78 యూనివర్సిటీల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరితో పాటు పోటీల పర్యవేక్షణకు కోచ్‌లు, ఇతర వ్యవహారాల కోసం 300 మంది హాజరవుతున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా నిర్వహణతో పాటు అవసరమైతే ఫ్లడ్ లైట్ల నిర్వహణలో నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా వీసీ ప్రసాదరాజు, కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, కన్నబాబు, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్ హాజరవుతున్నట్టు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ ఆదివారం తెలిపారు.



జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో ఖోఖో పోటీలకు సిద్ధం చేస్తున్న ఫ్లడ్ లైట్లు



మెగా వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులతో డీఎస్పీ, సీఐ తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కాకినాడ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సర్పవరం పోలీసుల ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా యువత సంప్రదాయ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు కాకినాడ సబ్ డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం రవి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో మెగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాతో పాటు యానాం తదితర ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. చివరి రోజు మంగళవారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రారంభ మ్యాచ్‌గా యానాం, గైగోలుపాడు జట్ల మధ్య పోరు జరిగింది.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

బాలాజీచెరువు: గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక అరుణ హాస్పిటల్ అధినేత చవ్వాకుల రాంబాబు, హిమబిందులు అందజేసిన బంగారు, వెండి బహుమతులు విజేతలకు ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అందజేశారు. ముందుగా మహిళలు వేసిన ముగ్గులను అతిథులు సందర్శించి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భోగిమంట, హరిదాసు వేషధారణ, బసవన్న విన్యాసాలు తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు గోడి సత్యవతి వెంకట్, నల్లబిల్లి సుజాత పాల్గొన్నారు.

పింఛనుదార్ల సౌలభ్యానికి బయోమెట్రిక్

కరప: పింఛన్లు తీసుకుంటున్న మండల విశ్రాంత ఉద్యోగుల సౌలభ్యం కోసం బయోమెట్రిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆ సంఘం ప్రతినిధులు పెదిరెడ్డి తాతారావు, మేడిశెట్టి రాఘవస్వామి, పి.నాగరాజు, యాళ్ల వెంకట్రాజు తెలిపారు. స్థానిక మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ కేంద్రాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ఏటా జనవరి నెలలో రిటైర్డు ఉద్యోగులు బయోమెట్రిక్ వివరాలు అందజేసి, జీవన ప్రమాణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ వివరాలు ఇచ్చేందుకు పింఛన్‌దార్లు అందరూ కాకినాడలోని పెన్షన్ హోమ్‌కి వెళ్లక్కరలేకుండా కరపలో ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పెన్షనర్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కరపలో ఒకరోజు బయోమెట్రిక్ తీసుకోవడానికి కంప్యూటర్ ఆపరేటర్ కె.స్వాతి అంగీకరించడంతో కరపలో ఏర్పాటు చేశామని తాతారావు మాస్టారు తెలిపారు. మండలంలోని విశ్రాంత ఉద్యోగుల నుంచి వేలిముద్రలు, ఐరిస్ తీసుకుని నమోదు చేయించుకున్నట్టు రిటైర్డు ఉద్యోగులు తెలిపారు. అనారోగ్య కారణంగా నడవలేని పింఛన్‌దార్ల ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ తీసుకున్నట్టు సంఘనాయకులు తెలిపారు.



కరపలో బయోమెట్రిక్ వివరాలు నమోదు చేయించుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గ ఎన్నిక

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విశ్వ బ్రాహ్మణ పురోహిత పరిషత్ కార్యవర్గ ఎన్నికలు కాకినాడలోని అచ్యుతాపురం రైల్వే గేటు వద్ద నున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఏపీ పురోహిత పరిషత్ అధ్యక్షుడు అరికట్ల గోవర్ధనశాస్త్రి ఆధ్వర్యంలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంటుమిల్లి చంద్రశేఖరశాస్త్రి, కార్యదర్శిగా అల్లవరపు నాగేంద్రచార్యులు, కోశాధికారిగా అత్తిలి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా తాళాబత్తుల వీరభద్రాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు తుపాకుల సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పోలవరపు కృష్ణావధాని, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులుగా ముసినాడ నాగాచార్యులు, సహాయ కార్యదర్శిగా తాళాబత్తుల రాంబాబు, కార్యనిర్వాహక సభ్యులుగా కొడమంచలి సత్యనారాయణ, కల్వచర్ల పరిపూర్ణాచారి, ఎం.వీరభద్రరావు, ఉచ్చింతల నాగబ్రహ్మచారి, కొండూరి వసంతరావు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను సత్కరించారు.



జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు

జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

- యూటీఎఫ్ మహిళా సదస్సు డిమాండ్

కాకినాడ సిటీ: బాలికలకు విద్యను దూరం చేసే జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని యూటీఎఫ్ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఆదివారం యూటీఎఫ్ హోంలో జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సభను నిర్వహించిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమాలు–సమాజం మార్పు శ్రామిక మహిళల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ సమాజంలో మార్పులో మహిళా ఉద్యమాల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు అద్భుతమైన పాత్ర నిర్వహించారని వివరించారు. మరో పక్క సంస్కరణ ఉద్యమాలు మహిళలను చైతన్య పరిచాయన్నారు. అలాగే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా శ్రామిక మహిళల సమస్యలను ఎజెండాలోకి తెచ్చిందన్నారు. బిల్కిస్ బానోపై అత్యాచారం చేసిన దుండగులు మోడీ దృష్టిలో సచ్ఛీలురుగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 1998 నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో మూలుగుతుందన్నారు. దిశ చట్టం, నిర్భయ చట్టం వంటివి ఎన్ని వచ్చినా మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. భారత సమాజంలో 94 శాతం మహిళలు సరైన సౌకర్యాలు అందుకోలేకపోతున్నారని వాపోయారు. ఈ సమావేశంలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, బి. నాగమణి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి డీకేవీ దేవి, రెహమాన్, బి.రాజేశ్వరి, సీహెచ్ వేణు తదితరులు పూలే జీవితం, కృషి, త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూర్యావతి, బేబీ, కేవీ లక్ష్మి, ఎం వరలక్ష్మి, ఉషా, గంగాభవాని, దుర్గారాణి, తేజ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుబ్బరావమ్మ

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: కాకినాడకు వచ్చిన మంత్రి సీదిరి అప్పలరాజును ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఆదివారం రంగరాయ వైద్య కళాశాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి వెంట డాక్టర్ వాడ్రేవు రవి తదితరులు ఉన్నారు.

కళకళలాడిన సాగరతీరం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. ఉప్పాడ నుంచి కాకినాడ వరకు ఉన్న తీర ప్రాంతం సందర్శకుల కేరింతలతో కళకళలాడింది. అయితే తీర ప్రాంతం వెంబడి నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక కేంద్రంగా మారుతున్న ఉప్పాడ తీరానికి జిల్లా నలుమూలల నుంచి నిత్యం పర్యాటకులు వస్తున్నారు. సెలవులతో పర్యాటకు సంఖ్య మరింత పెరుగింది.

సమాజాన్ని నైతికత వైపు నడిపించేది రామాయణం

కాకినాడ కల్చరల్: సమాజాన్ని నైతికత వైపు నడిపించేది రామాయణమని సాహితీవేత్త కాకరపర్తి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో సాంస్కృతిక, కళారంగ ప్రోత్సాహవేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రామాయాణంపై ప్రసంగ సభ నిర్వహించారు. యుద్ధకాండపై సాహితీవేత్త కాకరపర్తి ప్రసంగం చేశారు. సమాజంలో నైతిక విలువలతో ఏవిధంగా జీవించాలో రామాయణం మనకు చెబుతోందని సభకు అధ్యక్షత వహించిన వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ అన్నారు. అనంతరం విద్యార్థులకు రామాయణంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. అనంతరం సాహితీవేత్త కాకరపర్తి దుర్గాప్రసాద్‌ను వేదిక సభ్యులు సత్కరించారు.. ఈ కార్యక్రమంలో ఉద్దగళ సుబ్బారావు, వి.వి.పద్మావతి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్

హీరో కృష్ణ కళారంగ సేవలు స్ఫూర్తిదాయకం



జ్యోతిప్రజ్వలనలో పాల్గొన్న పెద్దాడ సూర్యకుమారి, పేపకాయల రామకృష్ణ తదితరులు

కాకినాడ కల్చరల్: సినీ హీరో దివంగత కృష్ణ కళారంగ సేవలు స్ఫూర్తిదాయకమని సరస్వతీ గాన సభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లోని లక్కరాజు శేషుకుమారి సాంస్కృతిక వేదికపై జాన్ ఎలీషా మాస్టర్ ఆధ్వర్యంలో పేపకాయల రామకృష్ణ అండ్ ఫ్రెండ్స్ నిర్వహణలో 'నవ్వుతూ బతకాలిరా' పేరుతో సినీ సంగీత విభావరి ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ముందుగా సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి వెలిగించి కచేరీ ప్రారంభించారు. ఎల్.సత్యనారాయణ్(టిక్కు), సరస్వతీగాన సభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి తదితర వక్తలు దివంగత కృష్ణ కళారంగ సేవలను కొనియాడారు. అనంతరం కృష్ణ సినీ గేయాలు ఆలపించారు. అల్లూరి సీతారామరాజు, తేనే మనసులు, అగ్నిపర్వతం తదితర సినిమాల్లోని గేయాలను గాయకులు పేపకాయల రామకృష్ణ, బాబి, కుమార్, ప్రభాకర్, శాస్త్రి తదితరులు ఆలపించారు. వాయిద్య కళాకారులు తిరుమలరావు, సాల్మన్, మూర్తి తదితరుల సంగీత సహకారం అందజేశారు. ఈ కార్యక్రమానికి పెద్దిరెడ్డి సతీష్, అడ్వకేట్ కృష్ణప్రకాష్, డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో సినీ హీరో కృష్ణ అభిమానులు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో కలిసిన ఏపీఎస్పీ 10వ తరగతి పూర్వపు విద్యార్థులు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. సూర్యారావుపేట లైట్ హౌస్ సమీపంలోని శిల్పారామం వెనక హరిత రిసార్ట్స్‌లో సుమారు వంద మంది వరకు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఒకరితో ఒకరు సుఖ సంతోషాలు పంచుకున్నారు. తాము విద్యనభ్యసించిన పాఠశాలకు మౌలిక వసతు కల్పించడంతో పాటు ఆర్థికంగా వెనకబడిన సహచరులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో లండన్‌లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెనర్జీ, గంగరాజు, వెంకటేశ్వరావు, సత్యనారాయణ, జార్జి, హరిబాబులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

14 నుంచి షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో 14వ తేదీ నుంచి వానరసేన సంక్రాంతి షటిల్ టోర్నమెంటు ప్రారంభించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంటు పల్లపువీధి రామాలయం సెంటర్‌లో కొత్త సచివాలయం సమీపంలో ఉన్న క్రీడా స్థలంలో ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో విజేతకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడా కారులు ఈ టోర్నమెంటులో పాల్గొనేందుకు నిర్వాహకులను సంప్రదించాలన్నారు.